వాదించే విశ్లేషణలు కొత్తేమీ కాదు. కానీ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వివక్షే ఇక్కడా కాస్త ఎక్కువ తక్కువగా ఉందనే విషయాన్ని ఒప్పుకోక తప్పదు.

**రాణులకూ తప్పలేదు:** మన చరిత్రలో రాజులకే కాదు... రాణుల పాత్రకీ కొదవలేదు. దాతృత్వానికి దీటైన అహల్యాబాయి హోల్కర్, ఢిల్లీ సుల్తానత్‌ను ఏలిన రజియా పేర్లు అందరికీ పరిచయమే. కానీ శాతవాహన వంశం కుప్పకూలిపోకుండా నిలబెట్టిన నయనిక కేవలం చరిత్ర విద్యార్థులకే పరిచయం. తన భర్త మొదటి శాతకర్ణి అర్ధంతరంగా చనిపోయిన తర్వాత, కుమారుడిని గద్దె మీద ఉంచి పాలించిన వ్యక్తిగా నయనికను గౌరవిస్తారు. కానీ నయనికతో పాటుగా కశ్మీరును పాలించిన రాణి సుగంధ, రాజా విక్రమాదిత్యుడి కూతురిగా తనకు దీటుగా 20 ఏళ్ల పాలించిన ప్రభావతి... ఇలా మనం మర్చిపోయిన రాణుల జాబితా కూడా పెద్దదే!

**ముగ్గురు వైద్యుల కథ:** ఆనంది గోపాల్, కాదంబిని గంగూలి, రుక్మాబాయి. ఈ మూడు పేర్లు కొత్తగా వినిపించవచ్చు. కానీ ఆడపిల్లలు చదువుకోవడమే అసాధ్యం అనే రోజుల్లోనే సవాలక్ష పరిమితులను, అవమానాలను ఎదుర్కొని డాక్టర్ పట్టా పొందిన తొలి భారతీయ మహిళలు వీరు. 1886లో డాక్టర్ అయిన ఆనందిబాయి, ప్రసవ సమయంలో మహిళలకు సరైన చికిత్స అందాలనీ... దానికోసమే తన వృత్తి సాయపడాలనీ అనుకున్నారు. కానీ తన కల నెరవేరకుండానే 21 ఏళ్లకే చనిపోయారు. అదే ఏడాది డాక్టర్ డిగ్రీ అందుకున్న మరో వ్యక్తి కాదంబిని మాత్రం సుదీర్ఘకాలం ప్రాక్టీస్ చేయడమే కాకుండా అసోం తేయాకు కార్మికుల దగ్గర నుంచి, బీహార్ బొగ్గు కార్మికుల వరకూ పేదల ఆరోగ్యం కోసం అసాధారణ కృషి చేశారు. కాదంబిని కాలంలోనే వైద్యవృత్తి చేపట్టిన రుక్మాబాయిది మరో సాహసగాథ. బలహీన వర్గాల నుంచి వచ్చిన రుక్మాబాయి వైద్యపట్టా అందుకోవడమే కాకుండా వివాహ వ్యవస్థలో ఉన్న లోపాల మీద ఆమె చేసిన పోరాటంతోనే Age of Consent Act అనే చట్టం కూడా రూపొందింది.

**నిశ్శబ్దంగా నేలకొరిగిన యోధులు:** స్వేచ్ఛ ఎంత విలువైందో దాన్ని కోల్పోయినప్పుడే తెలుస్తుంది. అందుకే ఇప్పటికీ మన స్వాతంత్ర్యం కోసం పోరాడిన వీరుల గురించి తల్చుకుంటూనే ఉంటాం. కానీ అందులో మహిళల శాతం తక్కువే. అలాగని వారి పాత్రకేమీ కొదవ లేదు. మనం గాంధీ పేరు విన్నాం కానీ 'బుఢీ గాంధీ' (వృద్ధ గాంధీ) అనే పేరు విని ఉండం కదా! తన అసలు పేరు మాతంగిని హజ్రా. గాంధీజీ బోధనల స్ఫూర్తిగా సహాయ నిరాకరణ, ఉప్పు సత్యాగ్రహం లాంటి ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఓసారి తనే స్వయంగా ఆరువేల మందిని కూడగట్టుకుని ఓ ఊరేగింపును తలపెట్టారు. వేలమందిని ముందుండి నడిపిస్తున్న మాతంగిని మీద పోలీసులు తూటాలు పేల్చినా సరే జెండా పట్టుకునే నేల కొరిగారు. క్విట్ ఇండియా ఉద్యమంలో భాగంగా అసోంలో భారతీయ జెండాతో ముందుకు నడుస్తూ, బ్రిటిషర్లకు వ్యతిరేకంగా నినదిస్తూ తుపాకులకు బలైన మరో మహిళ కనకలతా బారువా. తన వయసు 18 ఏళ్లే. వీరే కాదు తన పక్కనే నడుస్తున్న భర్త చనిపోయినా, ఊరేగింపును ముందుకు నడిపించిన తారారాణి; ఉరిశిక్ష పడిన కొడుకును చూసి నిబ్బరంగా ఉండమని ధైర్యం చెప్పిన మాల్‌మతి... ఇలా స్వాతంత్ర్య పోరాటంలో అడుగడుగునా అండగా నిలిచిన మహిళలు ఎందరో. అంతదాకా ఎందుకు! మగవారు తూటాలకు నేల కొరిగినా, జైళ్లలో మగ్గినా ఇంటిని చూసుకుంటూ పిల్లలకు దేశభక్తిని నూరిపోస్తూ మరో తరాన్ని పోరుకు సిద్ధం చేసిన స్త్రీలను ఎలా మర్చిపోగలం. రష్యన్ విప్లవంలో ఇలాంటి వీరవనితలకు సంకేతంగా మాక్సిం గోర్కి రాసిన 'అమ్మ' నవల ఓ సంచలనం. అలాంటి అమ్మలు మనకు అడుగడుగునా ఉన్నారు! వారిని మర్చిపోయాం అంతే!

మునుపటితో పోలిస్తే ఇప్పుడు ఉద్యోగాలు చేసే స్త్రీల శాతం, చదువుకునే బాలికల సంఖ్య, నాయకత్వ స్థానంలో ఉన్న మహిళల స్థాయిల్లో మార్పు కచ్చితంగా ఉంది. కానీ ఇప్పటికీ వివక్ష నేరుగా కాకున్నా నిశ్శబ్దంగా మహిళల ఎదుగుదలను, ప్రయాణాన్ని ప్రభావితం చేస్తూనే ఉంది. ఇంట్లో తెలిసో తెలియకుండా మాట్లాడే మాటల దగ్గర్నుంచీ పనిచేసే మహిళల ప్రతిభను గుర్తించడంలో అలసత్వం వరకు అసమానత వివిధ రూపాల్లో ఉంది. దాన్ని గుర్తించి సరిదిద్దుకోవాల్సిన సమయమిది. లేకపోతే మరో పదేళ్ల తర్వాత మరో కథనం రాసేటప్పుడు కంప్యూటర్ యుగం సైతం గుర్తించని మహిళ ప్రతిభ అని మరో విశ్లేషణ చేసుకునే దుస్థితి వస్తుంది.

## కంప్యూటర్ యుగం తన చలవేనా!

కంప్యూటర్ లేని లోకాన్ని ఊహించలేం. అదే విధంగా తను లేని కంప్యూటర్‌నీ ఊహించలేం. అది బిల్‌గేట్స్, స్టీవ్ జాబ్స్ కాదు.... అడా లవ్‌లేస్! ప్రముఖ కవి బైరన్ కుమార్తె అడా. తనకు కొడుకు పుడతాడని తెగ ఆశపడిన బైరన్, అడా జననంతో చిరాకుపడిపోయాడు. పసివయసులోనే తనను, తల్లిని ఇంటి నుంచి బయటకు పంపేశాడు. తండ్రి నిరాదరణ, తల్లిదండ్రుల మధ్య గొడవలు, అనారోగ్యాల మధ్య అడా చదువులో సాంత్వన వెతుక్కుంది. ఆ ఆసక్తితోనే ప్రముఖ శాస్త్రవేత్త చార్లెస్ బాబేజ్‌తో స్నేహం చేసింది. బాబేజ్ రూపొందించిన యంత్రాన్ని తొలి కంప్యూటర్‌గా అందరూ పరిగణిస్తారు. నిజానికి ఆ యంత్ర రూపకల్పన వెనకాల బాబేజ్ ఉద్దేశం, లెక్కల్ని మరింత సులభతరం చేయడం. కానీ అడా అలా కాదు! ఆ యంత్రం అద్భుతాలు చేయబోతున్నదని తను ఊహించింది. దాన్ని ప్రచారం చేసేందుకు వ్యాసాలు రాసింది. అప్పటి శాస్త్రలోకం ఓ జడ పదార్థంగా భావిస్తున్న ఆ యంత్రాన్ని అందరికీ పరిచయం చేసింది. అంతేకాదు! దాన్ని ఎలా వినియోగించుకోవచ్చో చెబుతూ అడా రాసిన ఓ అల్గారిథమ్‌ను చరిత్రలోనే తొలి కంప్యూటర్ ప్రోగ్రాంగా పరిగణిస్తారు.






